# నోముల పురస్కార కథలు

## (2012, 2013)



సంపాదకుడు

ఎన్.ఎస్.రజనీశ్

# నోముల పురస్కార కథలు

*(2012, 2013)*

సలహాదారు

డాక్టర్ ఎన్.ఎస్. రాహుల్

సంపాదకుడు

ఎన్.ఎస్. రజనీశ్

సహసంపాదకుడు

ఎన్.ఎస్. అక్షయ్

నోముల సాహిత్య సమితి

తెలంగాణ

నోముల పురస్కార కథలు

సంపాదకుడు

ఎన్ఎస్ రజనీశ్

© నోముల సాహిత్య సమితి

మొదటి ముద్రణ:
ఆగస్టు, 2014

పుస్తకాలకు:
విశాలాంధ్ర, నవోదయ,
తెలుగుబుక్‌హౌస్ తదితర
ప్రముఖ పుస్తకాల దుకాణాలు

ముద్రణ:
చరిత ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్

ఎన్.ఎస్. అరుణ
నోముల సాహిత్య సమితి
సాయిటవర్స్, నాగార్జునకాలనీ
నల్లగొండ, తెలంగాణ
7799114349

ధర : 80 రూపాయలు

# పది రతనాలు


నిశ్శబ్ద ప్రళయం - ఆర్.దమయంతి ......................19

అన్వేషణ - ఎ. మోహనమురళీ కుమార్ ..................29

రెండోసారి రాదు - భమిడిపాటి గౌరీశంకర్ ..............39

ఉత్తమోపాధ్యాయ - వి. చెన్నయ్య (దోరవేటి) .............49

వెలుగు వచ్చింది నాన్నగారూ! - కె.బి కృష్ణ ...............59

అమాసకన్నుల పున్నమి - జూపాక సుభద్ర ...............69

బహుమతి - వల్లభాపురం జనార్దన ......................76

ఎఱ్ఱదుక్కి - ఎం. నారాయణ ............................86

పాదాలకు తగిలిన ప్రశ్నలు!-చింతకింది శ్రీనివాసరావు... 95

ఆఖరిపేజీ - సి.ఎచ్.వి.బృందావనరావు .................106

# నిశ్శబ్ద ప్రళయం

## ఆర్. దమయంతి

'ఇవాళ తెలుగుదీపం చూశావా?' ఫోన్ చేస్తూ చేస్తూనే ఆత్రంగా అడిగింది సరోజ.

ఇది పొద్దున్నే ఫోన్ చేసిందీ అంటే-ఏదో బలమైన విషయమే ఉంటుందను కుంటూ-'లేదే ఇంకా చూళ్లేదు. ఏమైనా స్పెషల్ న్యూసా?' ఉత్సాహంగా అడిగింది కాంతి.

'స్పెషలా' అని మెల్లగా అడుగుతావేంటీ?!.. అద్భుతం... ఒక అద్భుతం వుంది. వెంటనే చూడు. చూడగానే కెవ్వ్ మనకపోతే నా పేరు సరోజే కాదు..' ఛాలెంజ్ చేస్తోంది.

'అవునా? లైన్లోనే ఉండు, ఇప్పుడే చూస్తా...' అంటూ టీపాయ్ మీద పేపరందుకుంది. ఒక చేత్తో సెల్‌ని చెవి కాన్చుకుని, మరో చేత్తో  పేజీలను తిప్పుతున్న శబ్దాలు వింటోంది అవతల్నుంచి సరోజ.

'దొరికిందా?' మరింత ఆత్రంగా అడిగింది.

'చూస్తున్నా! ఎన్నో పేజీ అన్నావ్?'

సరోజ చెప్పింది

ఆ పేజీ తెరిచి చూస్తూ... ఆ ప్రకటన చదివింది కాంతి. మొదట కను బొమ్మలు

ముడిపడ్డాయి. ఆ తర్వాత విడు బడ్డాయి. చదువుతున్న కొద్దీ ఆమె ముఖం విశాల మవసాగింది. పూర్తి కాగానే సంతోషాన్ని ఆపుకోలేనిదాన్లా... నిజంగానే కెవ్వ్ మంటూ 'వా...వ్' అంటూ అరిచింది.

సరోజ 'హమ్మయ్య' అనుకుంది. గుండె మీద కొండంత ఉత్కంఠ భారం తగ్గిపోవడంతో!

'ఎంత శుభవార్త చెప్పావే సరూ?!! మనం అర్జెంట్‌గా కల్సుకుని మాట్లాడు కోవాలి. కాదు కాదు. పార్టీ చేసుకోవాలి. చెప్పు. నీకెక్కడ కావాలి?' పట్టలేని ఆనందంగా అడిగింది కాంతి.

సరోజ ఓ ఖరీదైన రెస్టారెంట్ పేరు చెప్పింది.

సై అంటే సై అనుకున్నారిద్దరూ.

సరోజ బై చెప్పి ఫోన్ పెట్టేసింది.

కాంతికి కాలు నిలవటం లేదు. మళ్లీ మరోసారి ఆ ప్రకటన చదివింది.

నిజంగానే అద్భుతమన్పించింది మరోసారి. ఇక ఆగలేని దాన్లా భర్తకి ఫోన్ చేసింది.

అవతల ఫోన్ లిఫ్ట్ చేయడం ఆలస్యమౌతోంది. భరించలేకపోతోంది.

ఆయన గారు ఫోన్ లిఫ్ట్ చేయడం ఆలస్యం...ఎప్పుడెప్పుడు ఈ విషయాన్ని... కాదు...ఈ శుభవార్తని చదివి విన్పించాలా అని అణువణువూ తహతహ పడిపోతోంది.

అతను ఫోన్ లిఫ్ట్ చేస్తూ 'ఏమిట్రా?' అన్నాడు.

అంతే ఈమె వాక్ప్రవాహం మొదలైంది.

వర్షాకాలంలో– నాగార్జునసాగర్ అన్ని గేట్లు ఒకేసారి తెరిస్తే కూడా అంత ప్రవాహం కన్పించదూ, విన్పించదు అనే రీతిలో సాగుతోంది ఆమె వాగ్ధాటి.

ఆమె చెప్పే ప్రతి అక్షరాన్ని ఎంత శ్రద్ధగా ఆలకిస్తున్నాడంటే ఇప్పుడతను 'ఊ' కొట్టడం కూడా ఆపేశాడు. ఉత్కంఠ వల్ల పెదాలు బిగించాడు. టెన్షన్‌తో చెంప దగ్గర కండరం బిగుసుకుంది. అతను వింటూనే వున్నాడు...

✡ ✡ ✡

'హలో అన్నయ్య! నీకీ వార్త తెల్సిందా?' అడిగాడు గోపీ.

'ఏ గుడ్ న్యూస్‌రా?' అర్థంకాని వాడిలా అన్నాడు శ్రీనివాస్.

తను విన్నదంతా పూసగుచ్చినట్టు చెప్పాడు అన్న గారికి.

అంతవిని 'నీకెలా తెల్సిందంతా?' అంటు ఆశ్చర్యాన్ని వ్యక్త పరిచాడు శ్రీనివాస్.

'ఇప్పుడే కాంతి ఫోన్జేసి చెప్పింది' గర్వంగా చెప్పాడు.

ఆ అన్నగారు ఇంకా ఆశ్చర్యానందాల్లో మునిగి, తేలకుండా ఉన్నాడు.

అసలా అన్నదమ్ములిద్దరూ ఏ కాలమూ కల్సుకునేదే లేదు. ఎప్పుడైనా ఫోన్ చేసి మాట్లాడుకున్నా... అది తల్లిదండ్రుల నుంచి రావల్సిన పాతిక లక్షల ఆస్తి గురించే తప్ప... మరో మాట గురించి వుండదు.

అలాంటి ఆ ఆదర్శ అన్నదమ్ములిద్దరూ మూకుమ్మడిగా ఆనందపడే ఒక వార్త ఇది!

'అయ్య బాబోయ్...ఇదంతా నిజమే?' ఓసారి చేతి మీద గిచ్చుకున్నాడు. నొప్పేసింది. హమ్మయ్యా! కలకాదు అంతా నిజమే. ఇది వాస్తవమైన వార్తే!

అధికమైన ఆనందంతో– అతనికి నోట్లోంచి మాట రావడం లేదు.

అన్న గారి మౌనాన్ని అపార్థం చేసుకుంటూ...

'ఏవిటన్నయ్యా? నీకిష్టం లేదా? అలా చేయడం?' దిగులుగా అడిగాడు.

'భలేవాడివే! ఎంత మాట. మనందరి అదృష్టం కొద్దీ దొరికిన అవకాశ మిది! వొదులుకుంటే– మనంత పరమ మూర్ఖులు ఎవరూ ఉండరు. వెంటనే మనం ఆ ఏర్పాట్లలో ఉందాం. అవునూ? ఎప్పుడన్నావ్, ఎక్కడన్నావ్?'

'రేపాదివారమే! సాయంత్రం ఖచ్చితంగా అయిదింటికల్లా అక్కడుండాలి. నేనిక్కడ్నుంచి అమ్మను తీసుకొస్తా. నువ్వకడ్నుంచి నాన్నని తీసుకురా! సరేనా!'

ప్లాన్ని పక్కా చేసాడు తమ్ముడు.

'శభాష్' అన్నాడు అన్న హుషారుగా.

ఎప్పుడు లేనిది – తమ్ముడెంత ముద్దొచ్చేస్తున్నాడో చెప్పలేం.

'వొరేయ్. ఈ కార్యక్రమం కాగానే ఆ ఇల్లు అమ్మకం గురించి కూడా మాట్లాడేసుకుందాం. ఏంటావ్?'

'అలాగే అన్నయ్య! ఇంకాలస్యం ఎందుకు?'

'భలే భలే! ఇప్పుడే ఈ విషయాన్ని వదినకు కూడా ఫోన్చేసి చెబుత. పిచ్చిది తెగ సంతోషపడిపోతుంది'.

'అలాగే అన్నయ్య! మరిక వుంటా!' అంటూ సెలవు తీసుకున్నాడు అతి వినయంతో.

గుండె నిండిపోయే శుభవార్తను పెళ్లాం చెవిలో వేయడానికి ఇక క్షణమైనా ఆలస్యం కానీయ లేదు ఆ అన్న– శ్రీనివాస్!

'ఏవిటిలా చేసారు ఫోన్?' వేళాకోళంగా అడిగింది సౌదామిని భర్తని.

'నీ మీద ప్రేమేసి...' చెప్పాడు ఆ భర్త.

'అబ్బో! నా మొహానికంత అదృష్టం కూడానా!' విస్సురు విసిరింది. అవతల్నుంచి మురిపెంగా నవ్వుతున్న భర్త నవ్వుకి అర్థం ఏమిటో తెల్సిరావడం లేదు సౌదామినికి.

ఇంత సరసంగా ఆయన తనని పలకరించడం– తమ వైవాహిక జీవితంలో ఇదే ప్రథమం. అయితే ఆమె ఇది ప్రణయంగా కాకుండా ప్రళయంగా భావిస్తోంది.

ఆమె మనసేదో 'స్మెల్' చేస్తోంది.

ఈయన గారింత సొగసుగా, సొంపుగా మాట్లాడ్తున్నాడంటే తనని మాటల్తో బుట్టలో వేసి...ఆ తర్వాత ఆ 'రొంపి' ని తనకి తగిలించడానికే. తనికి తెలీదా ఏమిటీ? ఈ పొత్తులూ, జిత్తులూ!

తను జాగ్రత్తగా వ్యవహరించాలి. ఒళ్లు దగ్గర పెట్టుకుని జవాబు చెప్పాలి. ససేమిరా తను ఒప్పుకోదు. ఆ దరిద్రాన్ని ఇంట్లో తగలెట్టుకోకూడదు. గట్టిగా తనకి తనే చెప్పుకుంది.

'మీరేం చెబుతారో నాకు తెల్సులేండి. రాత్రేగా పెద్ద గొడవైందీ!..' రాగం తీసింది.

భర్త మళ్లీ నవ్వాడు. పొంగి పొంగి నవ్వాడు.

ఆమె నిటారైంది. ఎప్పుడూ లేంది ఏమిటీయన? జాక్‌పాట్ కొట్టినట్టు! కొట్టినట్టంటే గుర్తొచ్చింది భర్తకి బాటిల్ అలవాటుందని. ఆ ఆలోచన రాగానే గబాల్న అడిగేసేంది. 'ఏమిటీ సంగతీ?... పుచ్చుకున్నారా?'

'నీ మొహం! పిచ్చిదానా! పిచ్చిదానా అని! నీకీ శుభవార్త చెబ్దామని చేశా'

'ఏమిటదీ? 'మందు' షాపుకి లైసెన్సొచ్చిందా?' ఆత్రంగా అడిగింది.

'దానికంటే గొప్ప అవకాశమే వచ్చింది. చెబుత విను' అంటూ పేపర్ ప్రకటన చదివి విన్పించాడు.

సౌదామిని మొహంలో వెలిగిన ఫ్లాష్‌లైట్లు. సెల్‌లోంచి ఆయన ముఖం మీద... డైరెక్టుగా కళ్లల్లోకొచ్చి పడ్తున్నాయి.

సౌదామినికైతే ఒక్క ఇంచైనా ఖాళీ లేకుండా వొళ్లంత నగలు దిగేసుకున్నట్టు కాదు... దిమ్మరించుకున్నంత ఆనందంగా వుంది.

'అలా' చేయండి బావుంది. పీడా విరగడౌతుంది. మనమిక హాయిగా పడుండొచ్చు' సంతోషంగా చెప్పింది.

ఆ భర్త కూడా హాయిగా నిట్టూర్చాడు ఎన్నో ఏళ్లుగా తమని పట్టిపీడిస్తున్న ఈ సమస్యకి ఇంత సులువైన మార్గం దొరికినందుకు.

ఆ ప్రకటనదారునికి చేతులెత్తి జోడించాడు ఆ భర్త! పేరు ముకుందం!

నిజానికి–

సరిగ్గా అదే క్షణంలో...

ఆంధ్రప్రదేశ్‌లో...

ఈ అన్నదమ్ములూ, వారి భార్యలూ, ముకుందం దంపతులే కాదు... ఎన్నో వేలమంది...కాదు కాదు...లక్షల మంది కొడుకులు...ఆ ప్రకటనదారునికి చేతులెత్తి, శిరస్సు వంచి దండాలు పెడ్తున్నారు.

ఆదివారం సాయంత్రం కావడానికి అప్పటికి సరిగ్గా ఇరవై నాలుగు గంటలు కూడా లేవు. ఆ చీకటి గదిలో అతను ఒక్కడే కూర్చోనున్నాడు. క్షణం గడుస్తున్న కొద్దీ... తెలీని భయం పెరుగుతుపోతోంది అతన్లో.

ఎడతెరిపి లేకుండా ఎస్సెమ్మెస్‌లు, ఫోన్‌కాల్స్ అంతకంతకూ పెరిగి పోతున్నాయి.

'పాపం పెరిగిపోతున్నట్టు కదూ!' మనసు మూల్గుతోంది.

'అసలీ ప్రకటన ఇచ్చి తను తప్పు చేస్తున్నాడా?' అంతకుముందు కొన్ని లక్షలసార్లు అనుకున్నట్టే ఇప్పుడూ అనుకుంటున్నాడు. ప్రకటన ఇచ్చేముందు కూడా ఈ అక్షరాలను, తడిమి తడిమి చివరిసారిగా చదువుకుంటూ కూడా ఇలాగే అనుకున్నాడు.

మనసు దిటవు చేసుకుని, ధైర్యం చేశాడు.

ప్రకటన చదివిన జనం నుంచి తను ఆశించిన దానికంటే విపరీతమైన రెస్పాన్స్ వస్తున్నందుకు...అతనికి ఆనందంగా లేదు. దు:ఖంగా వుంది. అది అంతకంతా పెరిగి తుపానుకి ముందు నిశ్శబ్దంలా ఉంది హృదయం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nomula+Puraskara+Kathalu+2012+2013**

* * *